ప్రజాశక్తి

సోమవారం 18 సెప్టెంబర్ 2023



రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, మండల కార్యదర్శి పాంగి.భీమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని కర్రిముక్కిపుట్టు, బర్రగులు, దశలిపుట్టు, తంగుల గ్రామాల్లో నష్టపోయిన వరి, రాగులు, జొన్నలు, చిరు ధాన్యాలతో పాటు, రాజ్మా పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, పలు గ్రామాల్లో రైతులు వరి, రాజ్మా పంటలపై ఆధారపడి బతుకుతున్నారని, మొలకెత్తిన వారం పది రోజుల్లో భారీగా కురిసిన వర్షాల కారణంగా రాజ్మా పంట పోయిందన్నారు. అధికారులు గ్రామాలలో సందర్శించి నష్టపోయిన రైతు వివరాలు సేకరించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, కొండలరావు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న నేతలు

మన్యంలో వినాయక సందడి

-పెరిగిన గణనాథుల విగ్రహాల ధరలు- నేటి నుంచి ప్రారంభం



విగ్రహన్ని తీసుకెళుతున్న యువకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పల్లె, పట్నం, చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఎదురు చూస్తున్న వినాయక చవితి రానే వచ్చింది. ఈనెల 18 నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో భక్తులు మండపాల ఏర్పాటు, విగ్రహాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రం పాడేరు పట్టణంతో పాటు ఏజెన్సీ వ్యాప్తంగా ఈ ఏడాది వినాయక చవితిని ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. వినాయక పండుగను పురస్కరించుకొని మండపాలు రూపుదిద్దుకుంటున్నాయి. మండపాల ఏర్పాటులో ఉత్సవ కమిటీలు, యువత నిమగ్నమయ్యారు. చిన్నల నుంచి పెద్దల వరకు గణేష్ మండపాలను అలంకరించుకునే పనుల్లో ఉన్నారు. ఈనెల 18 నుంచి భక్తులు పూజలు అందుకునేందుకు పాడేరు పట్టణంలో భారీ విగ్రహాలను, వివిధ ఆకారంలో గణేష్ విగ్రహాలు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. మైదాన ప్రాంతాల నుంచి తీసుకువచ్చినవి ఇక్కడ విక్రయిస్తారు. ఈసారి విగ్రహాల ధరలు ఆకాశాన్నంటాయి. ఒక్కో విగ్రహానికి గతేడాదితో పోలిస్తే 30 నుంచి 40శాతం రేట్లు పెరిగాయి. వీటిని కొనుగోలు చేసేందుకు భక్తులు భయపడుతున్నారు. జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి వాహనాల్లో తీసుకెళ్తుంటారు. బొలెరోలు, ఆటోల్లో, ఇతర వాహనాల్లో వినాయక ప్రతిమలను గ్రామాలు, పట్టణాల్లోని వీధులకు తరలిస్తున్నారు.

పెరిగిన భారం..

ముడిసరుకులు, అద్దెలు, కూలీల రేట్లు, రంగుల ధరలు ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరుగుతుండడంతో పాటు ఖర్చులు కూడా పెరిగాయి. ఈసారి విగ్రహాల ధరలు అమాంతం పెంచేశారు. మూడేళ్ల క్రితం రూ.3 వేలు ఉన్న విగ్రహాలు ఈ ఏడాది రూ.5 నుంచి రూ.7 వేల వరకు పెరిగాయి.

మార్కెట్లో చిరు వ్యాపారుల తాకిడి..

పాడేరు : వినాయక చవితి సందర్భంగా జిల్లా కేంద్రం పాడేరు లోని మార్కెట్ ఆవరణ అంతా చిరు వ్యాపారుల తాకిడి ఎక్కువైంది. వినాయకునికి ప్రీతిపాత్రమైన రకరకాల ఫలాలు, పత్రి, వెదురు బద్దలతో తయారుచేసే పాలవెల్లులు ప్రమిదలు అమ్మకాలను చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున నిర్వహించారు. మెయిన్ రోడ్డు సినిమా హాల్ జంక్షన్ అంబేద్కర్ సెంటర్లో తదితరచోట్ల పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. వినాయక ప్రతిమలను భారీగా విక్రయించారు. పదివేల రూపాయల పైచిలుకు విలువైన పది అడుగుల నుంచి 15 అడుగుల ఎత్తులో రూపొందించిన వినాయక విగ్రహాలు మార్కెట్లో విక్రయించారు. గ్రామాల్లో వినాయక ఉత్సవాల్ని నిర్వహించేందుకు వాహనాల్లో భారీ వినాయక విగ్రహాలని కొనుగోలు చేసి తరలించారు.



మార్కెట్లో జనం

మట్టి గణపతిని పూజించాలి

మట్టి వినాయకుని ప్రతిమల్ని భక్తులు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోనూ వీధుల్లోనూ ప్రతిష్టించుకుని పూజించి తరించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మోద మజిలీరత్న అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో మోదకొండమ్మ అమ్మవారి గుడి వద్ద మట్టి వినాయకుని ప్రతిమల్ని ఎమ్మెల్యే భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొటగుళ్లి సింహాచలం నాయుడు ఆలయ ఆర్చకులు సుబ్రహ్మణ్యం అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు శివరాత్రి శ్రీనివాస్ బొద్దు ముకుందరావు సిద్దనాతి కొండలరావు ఉప్పల వెంకటరత్నం కారం దేవుడు పలాస బాలన్న కిషోర్ అల్లాడ నగేష్ పాల్గొన్నారు.

సీలేరు: జికె.వీధి మండలం సీలేరులో వినాయక చవితి ఉత్సవాల సందడి నెలకొంది. ఆదివారం సంత కావడంతో మారుమూల గ్రామాల నుంచి గిరిజనులు వినాయక విగ్రహాలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గణనాథుని పూజకు కావాల్సిన వివిధ రకాల పండ్లు ఎలుమ, మారేడు, కాయలు చెరకులు పూజా సామాగ్రి వివిధాకొనుగోలు చేశారు. సీలేరు పురవీధుల్లో వినాయక మండపాలు ముస్తాబు కావడంతో, పండగ శోభ అలుముకుంది. దుర్గా వీధి, మార్కెట్ సెంటర్ శ్రీ లక్ష్మీ గణపతి, వర్గక సంఘం, శివాలయం, అల్లూరి వీధి, మసీదు లైన్, తదితర వీధుల్లో గణనాథానికి మండపాలు ఏర్పాటు చేసి వివిధ రంగులతో అలంకరించారు. పండుగ సందర్భంగా పూజాసామగ్రి, పండ్లు, ఇతర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగిపోయినా, సరిపడా సామగ్రి కొనుగోలు చేశారు.

కొనుగోళ్లు తగ్గాయి

నిత్యావసరాలతో పాటు అన్ని రకాలుగా ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా వినాయక విగ్రహాల కొనుగోళ్లు తగ్గాయి. 40 శాతం అమ్మకాలు కూడా జరగలేదు. మూడేళ్ల నుంచి వ్యాపారం ఆశాజనకంగా లేదు. ఈ ఏడదైనా లాభాలు వస్తాయనే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది. ఎంతో కష్ట పడి విగ్రహాలు తయారు చేస్తున్నా ధరలు లబించక పోవడంతో తీవ్రంగా నష్ట పోతున్నాం.



కె.త్రినాథ్
విగ్రహాల వ్యాపారి, పాడేరు

ప్రశాంతంగా జరుపుకోవాలి

పండుగ మూలాలు తెలుసుకొని బాధ్యతగా వినాయక ఉత్సవాలను జరుపుకోవాలి. సామాన్యులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. విగ్రహ ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ఇతరులతో పోటీ పడకుండా సాంప్రదాయాలు పాటించాలి. నిమజ్జనం రోజున మద్యం సేవించి డాన్సులు చేస్తూ సమస్యలు సష్టించవద్దు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయాలి. ప్రభుత్వ సూచనలను పాటించాలి. శాంతి భద్రతల విషయమై పోలీసులకు సహకరించాలి.



బి.సుధాకర్,సిఐ పాడేరు

వైసిపి నేత నివాస గృహంలో

ప్రభుత్వ బోరు ఏర్పాటు తగదు : సిపిఎం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకులోయ మండలం చిన్నలబుడు పంచాయితీ కేంద్రంలో మంజూరైన బోరు పంపు వైసిపి మండల అధ్యక్షుడు ఎల్ లక్ష్మణ్ కుమార్ నివాస గృహం ఆనుకొని ఉన్న తోటలో ప్రభుత్వ బోరు ఎలా వేయించుకుంటారని సిపిఎం మండల కార్యదర్శి కెరామారావు, మండల నాయకులు కిల్లో మొద్దు ప్రశ్నించారు. ఆదివారం చిన్నలబుడు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం వేసిన బోరు పంపు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు మంచి నీరు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, తోట లోపల మండల అధ్యక్షుడు నివాస గృహంలో బోరు బావి నిర్మించుకోవడం ఎంతవరకు సబవన్నారు.అధికార పార్టీ అండదండలతో మండల అధ్యక్ష పదవి అడ్డం పెట్టుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాద న్నారు.గ్రామ ప్రజలకు అవసరం లేని విధంగా అధికార పార్టీ నాయకుడి ఇంట్లో బోరు వేసిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.



బోరును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

దిగొచ్చిన కూరగాయల ధరలు



సంతలో కూరగాయల దుకాణం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో కాయగూరలు మామూలు ప్రజలకు అందుబాటు ధరలోకి వచ్చాయి. నెల రోజులు క్రితం కిలో టమాట రూ.200లకు అమ్ముడుపోగా ప్రస్తుతం దాని ధర కిలో రూ.20లకు లభ్యమౌతోంది. నెలరోజుల క్రితం పచ్చిమిర్చి, అల్లం కిలో ధర రూ.200పైబడే ఉండగా, ఇపుడు రూ.100కే లభించడంతో ప్రజలు విరివిగా కొనుగోలు చేశారు. బెండకాయలు బీరకాయలు కూడా కిలో రూ.30 నుంచి రూ.40లోపే ధర పలుకుతోంది. కాలీఫ్లవర్, చిక్కుడు ధరలు కిలోకు రూ.10కు అటూఇటుగా ఉండగా, గోంగూర, ముల్లంగి, తోటకూర వంటి ఆకుకూరలు తక్కువ ధరలకే లభించడంతో స్థానికులు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చార్లు వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మాలీలు గిరిజనులు వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. కూరగాయల రేట్లు తగ్గడంతో ఆదివారం వారపు సంతకు వచ్చిన స్థానికులు సంచిల నిండుగా కొనుగోలుచేసి సంతోషంగా వెళ్లడం కనిపించింది.

దోమల నియంత్రణకు చర్యలు



వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ సరోజిని

ప్రజాశక్తి - విఆర్ పురం: దోమల నివారణకు గ్రామాలలో పారిశుధ్య పనులను వేగవంతం చేసేలా అధికారులు చర్యలను తీసుకోవాలని రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని కోరారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ అన్నవరంలో దోమల నియంత్రణకు పారిశుధ్య చర్యలను చేపట్టారు, గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. వర్షాలు కురుస్తున్న వేళ పారిశుధ్యం క్షీణించకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

కలువపూలకు వెళ్లి వ్యక్తి మృతి

వినాయక ఉత్సవాల్లో అపశృతి



చెరువులో పడి మృతి చెందిన రమణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వినాయక చవితి నేపథ్యంలో పొట్టకూటి కోసం కలువ పువ్వులు సేకరించేందుకు చెరువుకు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలుజారి నిరుపేద వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని వనకరాయి గ్రామంలో చోటుచేసుకుంది, పోలీసుల కథనం ప్రకారం, రాజవొమ్మంగి గ్రామానికి చెందిన భీమిని రమణ(46) కుటుంబం రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు, వినాయక చవితి పండుగ నేపథ్యంలో కలవ పువ్వులు విక్రయిస్తే డబ్బులు వస్తాయని, కుటుంబమంతా సంబరంగా వినాయక చవితి పండుగ చేసుకుందామన్న ఆశతో భీమిని రమణ ఆదివారం మండలంలోని వనకరాయి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో కలువ పూలు పులు సేకరించేందుకు వెళ్లాడు, ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజవొమ్మంగి ఎస్ఐ టిజి నరేంద్ర ప్రసాద్,సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



తమిళనాడు వెళుతున్న నాయకులు

జాతీయ మహాసభలకు

తరలిన ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-పాడేరు: తమిళనాడు ఏజెన్సీలోని నమ్మకల్ ప్రాంతంలో ఈ నెల 19, 20, 21, తేదీల్లో జరుగుతున్న ఆదివాసి గిరిజన సంఘం నాల్గవ జాతీయ మహాసభల కు ఆంధ్ర రాష్ట్రం నుంచి జిల్లాలకు చెందిన 34 మంది ఆదివాసీ ప్రతినిధులు ఆదివారం తరలి వెళ్లారు. ఈ మహాసభలకు ఆంధ్ర తరపున హాజరవుతున్న ఆదివాసి గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పల నరస ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, చట్టాలు పరిరక్షణే ధ్యేయంగా ఈ నాల్గవ జాతీయ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. విశాఖలో మూడవ జాతీయ మహాసభ జరిగిన, నాటి నుండి నేటి వరకు ఆదివాసీ హక్కులు, చట్టాల పై కేంద్ర ప్రభుత్వ దాడులు వాటిని ప్రతిఘటిస్తూ నిర్వహించిన ఉద్యమం, పోరాటం పై సమీక్షించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక ను ఈ నాల్గవ మహాసభల్లో రూపొందించుకోవడం జరుగుతుందన్నారు.ఆంధ్రా ప్రాంతంలో స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి, ఉద్యోగం నియామక ప్రమోషన్ లో వంద శాతం రిజర్వేషన్ ను సుప్రీం కోర్టులో రద్దు చేయడం, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం, 5 వ షెడ్యూల్డ్ ఏరియా లో నాన్ షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీ గ్రామాలను చేర్చడం, బోయ వాల్మీకి ను ఎస్టీ జాబితాలో చేర్చడానికి వ్యతిరేఖంగా తీర్మానం చేసి రాష్ట పతికి సిఫార్సు చేయడం, హైడ్రో పవర్ ప్రాజెక్టు, మైనింగ్ కంపెనీ లకు లీజుకు ఇవ్వడం మొదలగు సమస్యలపై జాతీయ మహాసభలో చర్చిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రాం బాబు, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిని దర్మన్న పడల్, పొద్దు బాల్ దేవ్ తదితరుల పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

టిఎస్ఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:-మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యుసి శాశ్వత మెంబర్ టి.సుబ్బిరామిరెడ్డి (టిఎస్ఆర్) జన్మదిన వేడుకలను మండలంలోని గుంటసీమ గ్రామంలో ఆ పార్టీ ఆదివాసి రాష్ట్ర చైర్పర్సన్ పి శాంతకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు ఆమే పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సుబ్బరామిరెడ్డి ప్రజలకు ఎంతో సేవలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి టీ.చిన్నస్వామి, స్థానిక మండల అధ్యక్షుడు జి.జగన్నాథం పాల్గొన్నారు.

తవ్వేశారు.. వదిలేశారు..!

- శంకుస్థాపన చేసి మూడేళ్లయినా చేపట్టని నిర్మాణం
- ఉన్న రోడ్డును తవ్వేయడంతో రాకపోకలకు కష్టాలు
- అవస్థలు పడుతున్న తెల్లంవారిగూడెం ప్రజలు
- మొరపెట్టుకున్నా పట్టని నేతలు, అధికారులు
- అధ్వాన రహదారిలో నాట్లు వేసి నిరసన



అధ్వాన రహదారిలో వరినాట్లు వేసిన నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - విఆర్.పురం: కొత్తరోడ్డు నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వేశారు. ఆర్భాటంగా శంకుస్థాపన కూడా చేశారు. నిధులు మంజూరు చేశామని హడావిడి చేశారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత పనులు చేపట్టకపోవడంతో ఉన్న రోడ్డు పోయి, కొత్త రోడ్డు నిర్మాణం జరగక తెల్లంవారిగూడెం వాసులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగా సౌకర్యాలు మెరుగు పరచకపోగా, ఉన్నదాన్ని లేకుండా చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర అధికారుల తీరుపై గిరిజనులు మండిపడుతున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్డులో నాట్లు వేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

మండలంలోని పెద్దమట్టపల్లి నుండి నర్సంపేట వరకు 16.2కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితం రూ. 4 కోట్ల 33 లక్షలు నిధులను మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణానికి పెద్దమట్టపల్లి వద్ద అప్పట్లోనే ఎమ్మెల్సీ అనంతపురం ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉన్న రోడ్డును పూర్తిగా తవ్వేశారు. కొత్తరోడ్డు నిర్మాణానికి హడావిడి చేశారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత పనులు చేపట్టే కాంట్రాక్టర్ గానీ, పర్యవేక్షించాల్సిన అధికారులు గానీ, శంకుస్థాపన చేసిన నేతలు గానీపత్తా లేకుండా పోయారు. మూడేళ్ల గడిచినా నేటికీ అంగుళం రోడ్డు నిర్మాణం కూడా జరగలేదు.

రోడ్డు తవ్వేయడంతో కొత్త కష్టాలు

తారురోడ్డు పునర్నిర్మాణానికి ఉన్న రోడ్డును తవ్వేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి కొత్త కష్టాలు మొదలయ్యాయి. అంతవరకు మామూలుగా ఉన్న రోడ్డును అడ్డగోలుగా తవ్వేసి, కొత్తగారోడ్డు నిర్మించకపోవడంతో ఏకంగా రహదారి లేకుండా పోయిందని తెల్లంవారిగూడెం గ్రామ గిరిజనులు అవేదన వ్యక్తం చేశారు .రోడ్డును తవ్వి వదిలేయడంతో ఎక్కడికక్కడే రాళ్లు తేలి ప్రయాణసంకటంగా మారింది. తర్వాత నిర్వహణ కూడా లేకపోవడంతో అడుగడుగునా మోకాలి లోతు గోతులై, వాటిలో నీరు నిండిపోవడంతో పాదచారులే కాకుండా వాహనాలు వెళ్లే వీలులేకుండా పోయింది. దీంతో 20కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం విఆర్ పురం వెళ్లాలంటే తాము నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అత్యవసరంతోపాటు నిత్యం రాకపోకలకు పడే కష్టాలపై అధికారులు, నేతలు స్పందించి, రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని గిరిజనులు మొర పెట్టుకుంటున్నారు.

అధ్వానరోడ్డులో నాట్లు వేసి నిరసన

నిధులు మంజూరై, శంకుస్థాపన చేసినా రోడ్డు నిర్మాణంలో జాప్యం, ఉన్న రోడ్డును తవ్వేయడంతో తాము పడుతున్న కష్టాలపై అధికారులు, నేతల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదివారం తెల్లంవారిగూడెం గ్రామస్తులు కుందులూరు.మాజీ సర్పంచ్ తెల్లం కన్నమ్మ అధ్వర్యంలో రోడ్డుపై ఉన్న బురదలో వరినాట్లు వేసి నిరసన చేపట్టారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెద్దమట్టపల్లి నుండి తెల్లంవారిగూడెం మీదుగా నర్సింగపేట వరకు ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

అత్యవసర సమయంలో అవస్థలు



కొద్దోగొప్పో ఉన్న రోడ్డును తవ్వేశారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపట్ట లేదు. మూడేళ్లుగా 16 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడు తున్నారు. గర్భిణులు, రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

తెల్లం. కన్నమ్మ,
మాజీ సర్పంచ్, కందులూరు

వైద్యానికి ఇబ్బందులు



పునర్నిర్మాణం పేరుతో ఉన్న రోడ్డును తవ్వే యడంతో నిండా గోతులమయమైన రహదారితో నిత్యం ఇబ్బందులు పడు తున్నాం. అత్యవ సర, నిత్యావసరా లకు ఊరు దాటి వెళ్లాలంటే భయమేస్తోంది. రోడ్డు బాగోలేక 104,108వాహనాలు రావడం లేదు. వైద్యానికి నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు.

తెల్లం కన్నారావు, తెల్లంవారిగూడెం

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



శంకుస్థాపన చేసినా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై అధికారులు, నేతలను ఎవరిని అడిగినా పట్టించు కోవడం లేదు. 16 గిరిజన గ్రామాల ప్రజలు రాకపోక లకు ఇక్కట్లు పడుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

తెల్లం తమ్మయ్య,
తెల్లంవారిగూడెం

చంద్రబాబు అరెస్టుపై నిరసన



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న టిడిపి పరిశీలకుడు వేణుగోపాలనాయుడు

ప్రజాశక్తి చింతూరు : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ చింతూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఐదోరోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. రంపచోడవరం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ఎర్ర వేణుగోపాల్‌రాయుడు మాట్లాడుతూ పాలన, అభివృద్ధిపై కనీస అవగాహన లేని వ్యక్తి నేతృత్వంలో రాష్ట్రంలో అసమర్ధ పాలన సాగడం ఆంధ్రాప్రజల దౌర్భాగ్యమన్నారు. చంద్రబాబుపై కేవలం కక్ష సాధింపుకోసమే జైలుపాల్జేసిన విషయంపై లోకమంతా ఖండిస్తున్నా, వైసిపి నేతలు ఎదురుదాడి చేస్తూ కువిమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. దుర్మార్గపు వైసిపి పాలనపై పోరాటానికి టిడిపితో కలిసి నడిచేందుకు జనసేనాని పవన్‌కల్యాణ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రంపచోడవరం టిడిపి ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, మాజీ ఎంపీ సోడి రామయ్య. అరకు పార్లమెంటు ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘం శ్రీకాంత్. కరక రమణ, విఆర్ పురం మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ముత్యాల రామారావు ప్రకాశరావు, చింతూరు మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు రామారావు చౌదరి, వల్లభనేని చంద్ దొంతు మంగేశ్వరరావు గడిసుల రంజిత్, జనసేన నాయకులు పయ్యావుల నాగేశ్వరరావు, మీడియం రమణ పెద్ద మంత్రి అజయ్ వీఆర్ పురం కూనవరం చింతూరు ఎటపాక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రంపచోడవరం :

చంద్రబాబు విడుదలను కోరుతూ రంపచోడవరంలో టిడిపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు యర్రా వేణుగోపాలరాయుడు, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్ పాల్గొని స్థానిక లూథరన్ చర్చిలో క్రిస్టియన్ సంఘం పెద్దలు ఫాస్టర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అడ్డతీగల మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, జనసేన నాయకులకు పూలదండలు వేసి దీక్షను ప్రారంభించారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, రాష్ట్ర నియోజకవర్గ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: పెదబయలు మండలం లక్ష్మిపేట పంచాయతీ మొండికోట గ్రామస్తుడు కించాయి విజయ్ కుమార్ పై దాడి చేసిన పెదబయలు ఎస్ఐ, గుత్తే దారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొర్ర త్రినాథ్, మండల నాయకులు వంతల లైకోన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, పెదబయలు మండలం లక్ష్మి పేట పంచాయతీ మొండికోట గ్రామస్తుడు కించాయి విజయ్ కుమార్‌కు వ్యవసాయ భూమిలో సెల్ టవర్ నిర్మాణం కోసం స్థలం కావాలని పెదబయలు ఎస్ఐ, గుత్తేదారులు లక్ష్మీపేట గ్రామంలో వెళ్లి విజయ్ కుమార్ ను అడిగారన్నారు. ఈ భూమిలో సెల్ టవర్ నిర్మాణం చేస్తే కుటుంబ పోషణకు ఇబ్బందులకు గురవుతామనివిజయ్ కుమార్‌కు అన్నందుకు పెదబయలు ఎస్సై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన పెదబయలు ఎస్ఐ, గుత్తేదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో కార్యాలయ ముట్టడిలు, రాస్తారోకోలు, ర్యాలీలు, ధర్నాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



పందులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

పందులకు టీకాలు

ప్రజాశక్తి- అనంతగిరి:పందుల్లో సంక్రమించే వ్యాధుల పట్ల పందుల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని కాశీపట్నం పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరావు అన్నారు. ఆదివారం గుమ్మకోట పంచాయతీ భీమవరం, గుమ్మడ, బీంపోలు పంచాయతీ పలు గ్రామాల్లో పందులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పందులు పెంపకం, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

కార్మికుల వైపే న్యాయం

ప్రజాశక్తి -తగరపువలస : సుదీర్ఘ కాలంగా జరుగుతున్న న్యాయపోరాటంలో చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల వైపే న్యాయం ఉంటుందని, ఇది వాస్తవమని చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం న్యాయ సలహాదారు, భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.అనార్యనరావు జ్యూట్ కార్మికులకు స్పష్టం చేశారు. చిట్టివలస జ్యూట్ మిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంతో నాలుగు కార్మిక సంఘాలు, ప్రభుత్వం కలిసి గతంలో చేసుకున్న ఒప్పందం చట్ట విరుద్ధమన్నారు. మెజారిటీ కార్మికుల భాగస్వామ్యం, ఆమోదం లేని ఎటువంటి ఒప్పందమైనా సరే చట్ట వ్యతిరేకమైనదని తెలిపారు. చట్ట ప్రకారం కార్మికులకు అందాల్సిన పరిహారం కోసం చేస్తున్న న్యాయమైన పోరాటంలో తుదకు యాజమాన్యం ఓడి పోతుందని, అనివార్యంగా కార్మికులే విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. కోర్టు ఆదేశాలను సైతం అనేక సందర్భాల్లో బేఖాతరు చేసిన యాజమాన్యం త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు అడుగుతున్న పరిహారం వారి హక్కు అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు వి.ఎస్.ఎ.నరసింహారావు, కార్యదర్శి జె.వెంకటరమణ, సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావు, జె.రమణ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధారామాల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి బీచ్ రోడ్డు జివిఎంసి 4వ వార్డు పరిధిలో తొట్లకొండపై ఉన్న బౌద్ధారామాల అభివృద్ధికి, వాటి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు, మాజీ కౌన్సిలర్ జి.వి.రమణ ప్రభుత్వాన్ని కోరారు. జివిఎంసి ఒకటో వార్డు, సంతోషిలో ఆదివారం స్థానికులకు బౌద్ధారామాల ప్రాధాన్యతను ఆయన వివరించారు. దళితులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక భవనం మంజూరుకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు.

ఘాట్ రోడ్డులో విరిగి పడుతున్న బండ రాళ్లు

భయాందోళనలో వాహనదారులు



విరిగి పడ్డ కొండచరియలు

ప్రజాశక్తి -అనంతగిరి: ఘాట్ రోడ్డు లో తరచూ బండరాళ్లు విరిగి పడుతుండటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ కొనసాగిస్తున్నారు మండలంలోని గత వారం వాహనాలు నడుపుతున్నారు. వర్షాల కారణంగా అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డు మార్గమధ్యలో పలుచోట్ల బండరాళ్లు విరిగి పడుతున్నాయి. శివలింగపురం, ట్రైడా, డమ్ముకు, అనంతగిరి మీదుగా బీసుపురం, అరకు మండలం సుంకరమెట్ట ప్రధాన రహదారి మలుపులలో ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.ఒకపక్క రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు మరమ్మతులకు గురవడం, మరోపక్క బండ రాళ్ల మట్టిదిబ్బలు జారి పడుతుండటంతో పర్యాటక ప్రాంతాలకు తిలగించేందుకు వచ్చిన పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సహాయక చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సింహాచలం ఇఒగా సింగాల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం నూతన ఇఒగా సింగాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఇఒగా ఉన్న వి.త్రినాధరావు నుంచి సోమవారం కొండపైన ఆస్థాన మండపం వద్ద బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సింగాల శ్రీనివాసరావు దంపతులు సింహాద్రి అప్పన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బాధ్యతలను స్వీకరించారు. అక్కడి నుంచి నేరుగా కొండ దిగువన ఉన్న కార్యాలయానికి వచ్చి సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆగమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులు వివరాలు, వారికి అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆఫీస్ పరిసరాలను పరిశీలించి తదుపరి కొండపైకి వెళ్లి అన్నదానంలో భక్తులకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. అన్నప్రసాదం ఎలా ఉందని భక్తులనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సహాయ కార్య నిర్వహణాధికారి రమణమూర్తి ఇఇలు శ్రీనివాస్‌రాజు, రాంబాబు, అన్నదానం సూపరింటెండెంట్ పాలూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.



సింహాచలం ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న సింగాల శ్రీనివాసరావు

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి ఆనందపురం : పేదలందరికీ మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం ఏర్పాటుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.50 లక్షలు వ్యయంతో నిర్మించబోయే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవనం (వైరస్ పరీక్ష ల్యాబ్) వల్ల మెరుగైన వైద్యం అందించడానికి దోహదపడుతుందన్నారు.

విద్య, వైద్యంలో జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రతి మండలానికి రెండు పిహెచ్‌సిలు ఏర్పాటుచేసి, కుటుంబ డాక్టర్ విధానం తీసుకొచ్చి, పిహెచ్‌సిలో ఒకరు, ఫీల్డ్‌లో ఒక డాక్టర్ ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ జగదీశ్వరరావు, ఉమావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షహనాజ్ సాదియా, ఆరోగ్య కమ్యూనిటీ అధికారి సాంబమూర్తి, సిసి నాగభూషణం, జడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, బంక్ సత్యనారాయణ, శ్రీను, బొట్ట రామకృష్ణ, సర్పంచ్ లోడగల రాజేశ్వరి, రమణ, చందక లక్ష్మి సూరిబాబు, రౌతు శ్యామల వెంకట్రావు పాల్గొన్నారు.



అదనపు భవనం ప్రారంభంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

నేరాలు ఘోరాలు



నిందితులతో పోలీసులు

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని రంగీలి సింగి పంచాయితీ కింజేరు గ్రామంలో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పి సీతారాం, పి త్రినాథ్‌లు ఆ గ్రామానికి చివరిలో 10 సెంట్ల భూమిలో 50 గంజాయి మొక్కలు సాగు చేస్తూ పట్టు పడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు. గంజాయి పంట సాగు చేస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

నేటి నుంచి అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో మొదటిసారిగా ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పిజిటిఐ) ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు అంతర్జాతీయ గోల్ఫ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు చెప్పారు. ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ క్లబ్ కార్యదర్శి మంతెన సత్యనారాయణరాజు మాట్లాడుతూ, ఈ పోటీలను తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. 18వ ప్రాక్టిస్ రౌండ్, 19న ప్రోయామ్ టోర్నమెంటు, సెప్టెంబరు 20 నుంచి 23 వరకు ప్రధాన టోర్నమెంటు జరుగుతాయని వివరించారు. ఈ నెల 23న ఇపిజిసిలో జరగనున్న బహుమతి ప్రదానోత్సవానికి ఎపి ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో భారతదేశంతో పాటు శ్రీలంక, కెనడా, బంగ్లాదేశ్, నేపాల్, జపాన్ దేశాల నుంచి సుమారు 126 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ టోర్నమెంట్‌ను యూరో స్పోర్ట్, సోషల్ మీడియా స్ట్రీమింగ్ ఎబిపి వార్తలలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. దూరదర్శన్‌లో కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. సామాన్యులకు కూడా అవగాహన కల్పించేందుకు నగరంలోని ప్రముఖ స్థలాల్లో హోర్డింగ్‌లు, టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ట్రెజరర్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు వినోద్‌బాబు, సభ్యులు నర్సింహరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ఉక్కు ప్రైవేటీకరణపై ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయం నుంచి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెనక్కు తగ్గేవరకూ ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పార్టీ శ్రేణులకు, ప్రజలకు, కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. సిపిఎం విశాఖ జిల్లా ప్లీనం ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లోకనాథం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ దూకుడును వేగవంతం చేసిందన్నారు. అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌ను అమ్ముతున్నట్లు రెండేళ్ల క్రితం ప్రకటించిందన్నారు. ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. 947 రోజులుగా ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ప్రజలు పెద్దఎత్తున పోరాడుతున్నా బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోవడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయడంలోనే బిజెపి ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు మాత్రం బిజెపి నిర్ణయాన్ని గట్టిగా అడ్డుకోలేకపోవడం హేయమైన చర్యని పేర్కొన్నారు. గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, రైల్వే, విశాఖపట్నం పోర్టు, రక్షణ రంగం వంటి ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలన్నింటిని అంబానీ, అదానీలకు కట్టబెడుతుంటే వాటిని కాపాడుకుంటా బిజెపి వంతపాడటం శోచనీయమన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు వెల్లెత్తుమాటాడకుండా ప్రజలను వక్రదారి పట్టిస్తున్నాయన్నారు. దేశంలో బిజెపిని ఓడించడానికి ఇండియా కూటమి ఏర్పడినా.. దానిలో కూడా ఈ పార్టీలు చేరలేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు అరెస్టుతో రాజకీయ వేడి పెరిగిందన్నారు. రాష్ట్ర వైసిపి ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపైనా, నాయకులపైనా ఉక్కుపాదం మోపుతోందని, ప్రతిపక్ష పార్టీలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని తెలిపారు. చంద్రబాబు అరెస్టు చేసే విధానాన్ని సిపిఎం ఖండించిందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా రాజకీయ వాతావరణాన్ని సృష్టించడం ప్రమాదకరమన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రజా సమస్యలపై అక్టోబరులో బస్ యాత్ర నిర్వహించి, నవంబరు 7న విజయవాడలో లక్షలాది మందితో సభ ఏర్పాటు చేస్తోందన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యాన ఉత్తరాంధ్రలో తలపెట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర ఏర్పాట్లను వివరించారు. 20న విశాఖ జివిఎంసి వద్ద ప్రారంభమయ్యే ఈ యాత్ర విజయనగరం, శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అరుకు, పాడేరు, అనకాపల్లి మీదుగా కొనసాగుతుందన్నారు. విశాఖలో దీని ఉపయాత్ర 21న ప్రారంభమై 26 వరకూ కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు, కార్మికులు, యువతీ యువకులు, మహిళలు భాగస్వామ్యం కావాలన్నారు. 29న జరిగే బహిరంగ సభకు వేలాది మంది కదలి రావాలన్నారు. ప్లీనంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, బి.పద్మ, బొట్ట ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వైశాఖీ నృత్యోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న మూడు రోజుల వైశాఖీ నృత్యోత్సవం ఆదివారంతో ముగిసింది. సాయంత్రం వేళ ఆంధ్ర నాట్యం, మయూర్ భంజ్ ఛౌ, మోహినీయాట్టం, ఛండాలిక కూచిపూడి నృత్య నాటిక ప్రదర్శనలు దేనికవే తన విశిష్టత చాటుకున్నాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డ్యాన్స్ ఇండియా ఆంధ్ర మాసపత్రిక సంపాదకులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) నిర్దేశకత్వంలో అద్భుతంగా ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ఈ ఉత్సవ ప్రదర్శనలు రాత్రితో ముగిశాయి.

అలరిస్తున్న ఐస్‌గెడ్డ జలపాతం అందాలు

ప్రజాశక్తి - సీలేరు: గలగల పారే సెలయేరులా ఎత్తైన కొండల నుంచి జాలువారే ఐస్‌గడ జలపాతాలు పర్యాటకులతో పాటు ప్రయాణికులు మనసులను హత్తుకుంటున్నారు. కట్టిపడేస్తున్న జలపాతం అపురూప దృశ్యాలు చూసి ప్రజలు పులకరించి పోతున్నారు. జీకే వీధి మండలం సీలేరుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో రహదారి పక్కనే ఆనుకుని ఉన్న ఐస్‌గెడ్డ అందాలు ప్రకృతి ప్రేమికులతోపాటు మామూలు ప్రజల మనసులను దోచుకుంటున్నాయి. వారం రోజులుగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలతో ఐస్‌గెడ్డ జలపాతాలు ఉరకలేస్తూ పరుగులుతీస్తూ, ప్రజలను మంత్రముగ్ధులు చేస్తున్నాయి.

మన్యంలో ఇటీవల కురిసిన వర్షాలతో సీలేరు నుంచి లంబసింగి వరకు దారి పొడుగునా ఎత్తైన కొండలు పచ్చటి అటవీ ప్రాంతంలో మంచు మేఘాలు ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ప్రతిరోజూ ఆవిష్కతమై ప్రతిఒక్కరి మదిని దోచుకుంటున్నాయి. ఈ సుందర దృశ్యాల నడుమ కొంతమంది పర్యాటకులు ఫోటోలు దిగుతూ, మధురానుభూతిని పొంది పరవశించి పోతున్నారు. అలాగే దారాలమ్మ ఆలయ సమీపంలో ఎత్తైన కొండలు మధ్య నుంచి గులకరాళ్ళ శబ్దాలతో జాలువారే జలపాతాలు దారకొండ ఆలయానికి వచ్చిన భక్తులకు ఎంతో అనుభూతిని కలిగిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు లంబసింగిని మరో కాశ్మీర్‌ను తలపిస్తున్నాయి. ఉదయం తెల్లవారి ఆరు గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతంలో పొగమంచు కొమ్ముకుని కనులపండగగా ప్రకృతి సాక్షాత్కారమౌతోంది.



ఐస్‌గెడ్డ జలపాతం వద్ద సందర్శకుల తాకిడి



దేహదాన అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కృష్ణారావు,
చిత్రంలో లోకనాథం, గంగారావు, కృష్ణారావు కుటుంబీకులు

ఆదర్శనీయుడు.. కృష్ణారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తన ఉద్యోగ ప్రస్థానంతోనూ, రిటైర్ అయిన తరువాత సమాజ వికాసానికి చేపట్టిన కార్యక్రమాలతోనూ, తుదకు చనిపోయిన తరువాత తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయంతోనూ అందరికీ ఆదర్శనీయునిగా యలమంచిలి కృష్ణారావు నిలిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐటిఐ జాయింట్ డైరెక్టర్ వై.కృష్ణారావు ఉద్యోగ విరమణ చేసి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆత్మీయ కలయిక పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షులుగా విశ్రాంత ఐటిఐ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు వ్యవహరించారు. అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ కృష్ణారావు తన ఉద్యోగ కాలంలో నిజాయితీగా, నిఖార్సుగా పనిచేసి పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ఎన్‌సిఆర్‌టి, ఎస్ఇఆర్‌టి సమస్య వచ్చినప్పుడు ఎస్ఎఫ్ఐగా తాము చేసిన పోరాటానికి తగిన సలహాలు ఇచ్చి ముందుకు నడిపిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం విశాఖలో జరిగిన పోరాటాల్లో తాను పాల్గొనడమే కాకుండా, తన శిష్యులనూ, తోటి ఉద్యోగులనూ భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ కృష్ణారావు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఐటిఐలో ఎంతో మంది ఆయన వద్ద విద్యనభ్యసించి ఉన్నతులుగా ఎదిగిన విషయాన్ని గుర్తుచేశారు. కుటుంబం యావత్తునూ మంచి మార్గంలో నడిపించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఐటిఐ పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ తోడర్‌మల్ మాట్లాడుతూ ఐటిఐల అభివృద్ధికి కృష్ణారావు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ స్కూల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, కవి బొడ్డ కూర్మారావు, ఐటిఐల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు, పలువురు ప్రిన్సిపాళ్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టు కోడూరు అప్పలనాయుడు రచించిన 'నిత్య పారిశ్రామికుడు.. కృష్ణారావు' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. రచయిత ప్రయత్నాన్ని మెచ్చుకుంటూ సత్కరించారు.

దేహదాన అంగీకారపత్రం అందజేత

కృష్ణారావు మరణానంతరం ఆయన పార్థివ దేహాన్ని పరిశోధనల కోసం మెడికల్ విద్యార్థులకు అందజేస్తామంటూ జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహ సంస్థ బాధ్యులు ఎం.అన్నపూర్ణకు కృష్ణారావు భార్య స్వరాజ్యరాణి, కుమారుడు వై.సత్యనారాయణ, కోడలు అనురాధ అంగీకారపత్రం అందజేశారు. వారికి అన్నపూర్ణ ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడారు. దేహదానం ప్రాధాన్యతను సభా వేదికగా వివరించారు.



జర్నలిస్టు అప్పలనాయుడు రాసిన 'నిత్య పారిశ్రామికుడు.. కృష్ణారావు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు వారపు సంతలో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. రామాలయం సెంటర్లో వచ్చిపోయే వాహనాలు నిలిపేసి, వాహన రికార్డులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి, అన్ని సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే విడిచిపెట్టారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టితో పోలీసుల తనిఖీలు సాగాయి. ప్రధాన కూడళ్లలో సిఆర్‌పిఎఫ్, మామూలు పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. అపరిచితులు, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘాతో తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే వాహనాలను ఎపి జెన్‌కో చెక్‌పోస్టు వద్ద నిలిపివేసి తనిఖీలు వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు.

అనారోగ్యంతో మారేడుబాక ఉప సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీ ఉపసర్పంచ్ ముర్ల లక్ష్మి (35) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. లక్ష్మి కొంతకాలంగా జ్వరంతో బాధపడుతూ ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో కుటుంబీకులు లక్ష్మీని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించడంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు ఉపసర్పంచ్ లక్ష్మి అకాలమరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ అణచివేత చర్యలపై పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలపై రాష్ట్ర ప్రభుత్వ అణచివేత, నిర్బంధం, కక్షపూరిత చర్యలకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తాటిపైకి వచ్చి పోరాటం నిర్వహించాలని, పౌర సమాజం కూడా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పలు రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షత వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పౌర సమాజం పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఇలాంటి చర్యలను ఇంతకు మునుపెన్నడూ చూడలేదని అన్నారు. చంద్రబాబు అరెస్టు తీరును ఖండిస్తున్నామని చెప్పారు. ప్రజల కోసం ఉద్యమించే కమ్యూనిస్టుల గొంతు నొక్కుతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి తనకు వ్యతిరేకంగా ఉన్నవారిపై ఇడి, ఐటి, సిబిఐ లాంటి సంస్థలను ప్రయోగిస్తోందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ పెద్ద ఎత్తున భూకబ్జాలకు పాల్పడుతున్న వైసిపి నేతలను ముందుగా అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాసరావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకురాలు డాక్టర్ సీతల్, లోక్‌సత్తా నాయకులు ఎంఎస్ఎన్.మూర్తి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వి డెంటల్ హాస్పిటల్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో వి డెంటల్ అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) విశాఖ ఎక్స్‌లెన్స్ చాప్టర్ ఉత్తమ పురస్కారాన్ని అందించింది. రామ్‌నగర్ లైన్స్ క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన జెసిఐ వీక్ జైత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వి డెంటల్ హాస్పిటల్‌ను బెస్ట్ డెంటల్ క్లినిక్ అవార్డుకు ఎంపిక చేశారు.